## క్లుప్తంగా

### విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

**తాటిచెట్లపాలెం:** గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ 33/11 కేవీ సబ్‌స్టేషన్, హెచ్‌టీ లైన్స్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ ఇంజినీర్ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అక్కయ్యపాలెం, ఎన్‌జీజీవోస్ కాలనీ, చిన్నూరు, అబిద్‌నగర్, రామచంద్రనగర్, రైతు బజార్, నరసింహనగర్, కైలాసపురం, శాంతినగర్, సంజీవయ్య కాలనీ, సుందర అభయాంజనేయ స్వామి ఆలయం, తాటిచెట్లపాలెం సిగ్నల్ పాయింట్, తాటిచెట్లపాలెం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

**మర్రిపాలెం సెక్షన్ పరిధిలో..**

**మురళీనగర్:** మర్రిపాలెం సెక్షన్ పరిధిలోని ఇందిరానగర్, కప్పరాడ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అరుంధతి నగర్, జయప్రకాష్‌నగర్, బాపూజీనగర్, తిక్కవానిపాలెం, సంజీవయ్య కాలనీ, అప్పర్ జయప్రకాష్‌నగర్, కప్పరాడ, రాంజీ ఎస్టేట్, కొత్తూరు, ఇందిరానగర్ 1–5, జయప్రకాష్‌నగర్–1 ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

### శివాలయ హుండీ ఆదాయం రూ.2.26 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న శ్రీహరి సేవకులు

**సీతమ్మధార:** జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో పర్యవేక్షణాధికారి పి.ఎల్.ఎన్.రాజు ఆధ్వర్యంలో కార్యనిర్వహణాధికారి పైలా శేఖర్‌బాబు పర్యవేక్షణలో గురువారం హుండీల ఆదాయం లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 140 రోజులకు గానూ రూ.2,26,113 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, శ్రీహరి సేవకులు పాల్గొన్నారు.

### ప్రపంచ శాంతిపై 20న సదస్సు

**మద్దిలపాలెం:** డాక్టర్ బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌లో ఈ నెల 20న ఉదయం 10 గంటలకు ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రీలిజియస్ ఫ్రీడం సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి అంశంపై సదస్సు జరగనుందని నిర్వాహకుడు నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనే వారు ముందుగా 90324 77463 నంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

### అనధికారికంగా బడ్డీల ఏర్పాటు



ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్ రోడ్డులో ఏర్పాటు చేసిన బడ్డీలు

**సీతమ్మధార:** జీవీఎంసీ 14వ వార్డులోని ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్ రోడ్డులో అనధికారికంగా బడ్డీలు వెలుస్తున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిస్తున్నాయి. సీతమ్మధారలోని పలు ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా బడ్డీల ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం రోడ్డు వాహనాతో రద్దీగా ఉంటోంది. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



# ముంగిట్లో పోస్టల్ సేవలు

- మారిన సాలగ్రామపురం సబ్ పోస్టాఫీసు చిరునామా
- తాటిచెట్లపాలెం ఎస్ఈ కార్యాలయంలోకి తరలింపు



తమ వాహనాల మీదే ఫారాలు నింపుకుంటున్న ఖాతాదారులు



తాటిచెట్లపాలెంలోని నీటి పారుదల అభివృద్ధి సంస్థ పర్యవేక్షక ఇంజినీర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న సాలగ్రామపురం సబ్ పోస్టాఫీసు

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 45వ వార్డు సాలగ్రామపురంలో ఉండే సబ్ పోస్టాఫీసు చిరునామా మారింది. సుమారు 30 ఏళ్లగా ఇక్కడ పోర్ట్ హైస్కూల్ సమీపంలో, కైలాసపురం బస్టాప్ పక్కనే ఉన్న ఈ ఉప తపాలా కార్యాలయాన్ని పోర్టు పరిసరాల నుంచి పూర్తిగా తరలించారు. నెల రోజులుగా ఈ ప్రక్రియగా చేపట్టి పూర్తిచేశారు. వారం రోజులుగా పోస్టల్ సేవలను ఖాతాదారులకు అందజేస్తున్నారు. ఇన్ని రోజులు ఈ పోస్టాఫీసు పోర్ట్ స్థలంలోని పోర్ట్ భవనంలో కొనసాగింది. పోర్ట్ స్థలాల స్వాధీనంతో పాటు ఆ భవంతి కూడా శిథిలావస్థకు చేరడంతో అధికారులు ఈ మేరకు తరలింపు చర్యలు చేపట్టారు. కై లాసపురం, సాలగ్రామపురం, పోర్ట్ క్వార్టర్స్, నరసింహనగర్, వరాహగిరి కాలనీ–1, 2, సత్యసాయినగర్, సింగాలమ్మపురం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల ప్రజలకు ఈ పోస్టాఫీసు అందుబాటులో ఉంది.

**ప్రస్తుత చిరునామా..**

సాలగ్రామపురం సబ్ పోస్టాఫీసును ప్రస్తుతం తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కనే గల ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల అభివృద్ధి సంస్థ పర్యవేక్షక ఇంజినీర్ కార్యాలయ ప్రాంగణంలోకి మార్చారు. ఈ భవనం కింది అంతస్తులో పోస్టాఫీసును ఏర్పాటు చేయడంతో దీని చిరునామా ఇంకా చాలా మందికి తెలియడం లేదు. తాటిచెట్లపాలెం జంక్షన్ నుంచి పోర్టు హాస్పిటల్ వెళ్లే మార్గంలో ఎడమచేతి వైపున ఈ పోస్టాఫీసు ఉంది. ఇటీవలే ఈ ప్రాంతానికి ఈ పోస్టాఫీసును మార్చడంతో ఇక్కడ సేవలు పూర్తిగా అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం రెగ్యులర్ సేవలన్నీ ఇక్కడ నుంచి పొందవచ్చు.

**అరకొర సదుపాయాలు..**

పాత పోస్టాఫీసులో వినియోగదారులు కూర్చునేందుకు బెంచీలు, దరఖాస్తులు నింపుకునేందుకు బల్లలు ఉండేవి. ప్రస్తుత ప్రాంతంలో అటువంటి సదుపాయాలేవీ వినియోగదారులకు అందడం లేదు. కనీసం వారి వేచి ఉండేందుకు నీడ కూడా లేదు. ఎండైనా, వానైనా బయట నుంచి వీరు సేవలను పొందాల్సిందే. బయట కనీసం షెడ్ వంటిది నిర్మిస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు ఖాతాదారులు సూచిస్తున్నారు. దీని కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు పోస్టాఫీస్ సిబ్బంది తెలియజేస్తున్నారు.

## రూ.2.37 కోట్లతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు

**సీతంపేట:** జీవీఎంసీ 44వ వార్డు రామచంద్రానగర్, అబిద్‌నగర్ ప్రాంతాల్లో సుమారు రూ.2.38 కోట్ల వ్యయంతో డ్రైయిన్ల నిర్మాణం, పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఈఈ శ్రీనివాస్, ఏఈ రమణమ్మ, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, బానాల తరుణ్, కాయల రామారావు, రెడ్డి, సీతారామ్, రామారావు, పి.గోపి, మహాదాస్య గోపి, దుర్గ, వెంకటరమణ, గ్రామ పెద్దలు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

## దుర్గమ్మకు కుంకుమ పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న రాజాస్వామి

**సీతమ్మధార:** శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో కొలువైన దుర్గమ్మవారికి ప్రధాన అర్చకుడు రాజాస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీ చక్రానికి కుంకుమ పూజలు సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభించారు. భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. ఆలయ సిబ్బంది శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ బీమా సాయం అందజేత



నగదు అందిస్తున్న కార్పొరేటర్ ప్రసాద్

**మర్రిపాలెం:** జీవీఎంసీ 50వ వార్డు మాధవధారకు చెందిన హేమచంద్ర గురువారం ఉదయం అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ వెంటనే స్పందించి సచివాలయం కార్యదర్శులతో మాట్లాడారు. వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా మృతుడి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ బీమా పథకం ప్రజలకు ఎంతగానో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయం సంక్షేమ కార్యదర్శి స్వామి నాయుడు, వలంటీర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుబజార్‌కు శ్రావణ శోభ



సీతమ్మధార రైతుబజార్‌లో పువ్వుల స్టాల్ వద్ద వినియోగదారుల రద్దీ

**సీతమ్మధార:** మొదటి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని సీతమ్మధార రైతుబజార్ వినియోగదారులతో కిటకిటలాడింది. గురువారం సాయంత్రం బజారులో పండ్లు, పూలు, మామిడి కొమ్మలు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, అరటాకులు, చెరుకుగడలతోపాటు ఇతర పూజా సామగ్రి కొనుగోలు చేశారు. ఏ స్టాల్ వద్ద చూసినా మహిళల సందడి కనిపించింది. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ పర్యవేక్షించారు.

## ప్రజలకు నాణ్యమైన సేవలే లక్ష్యం



43వ వార్డులో నివాసులకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న కె.కె.రాజు

**తాటిచెట్లపాలెం:** ప్రజలకు నాణ్యమైన సేవలందించడమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ లక్ష్యమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గురువారం 55, 43 వార్డుల్లో స్థానిక కార్పొరేటర్లు కె.వి.ఎన్.శశికళ, పెద్దిశెట్టి ఉషశ్రీలతో కలిసి ఆయన పర్యటించారు. రెడ్డి తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ, వేంకటేశ్వర కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి నివాసుల సమస్యలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వం నుంచి వారు అందుకుంటున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గతంలో రాజకీయ నాయకులు కేవలం స్వార్థం కోసం రాజకీయాలు చేసేవారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం మంచి మనసుతో ప్రజలకు మేలు చేయాలనే సత్సంకల్పంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ వార్డు అధ్యక్షులు కేపీ రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాసరావు, డైరెక్టర్లు రాయుడు శ్రీనివాసరావు, కాయిత వెంకటలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, నార్త్ బీసీ సెల్ ప్రెసిడెంట్ బొడ్డేటి గంగామహేష్, పార్టీ నాయకులు ఆళ్ల గోపి, యడ్ల శ్రీనివాసరెడ్డి, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, బి.వెంకట్, తిరుపతిరావు, మహదాస్యం గోపి, వెంకటేష్, పరదేశి, జామి దాసు, బి.రమణారెడ్డి, రాణి, రమ, ఖాదర్ వల్లీ, సూర్యారావు, లక్ష్మణ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



సహస్ర తులసీదళార్చనలో సిరులతల్లి

**డాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రనవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో పూజా రుసుం చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు క్షీరాభిషేక సేవ..**

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

## హెటిరో డ్రగ్స్‌లో ఉద్యోగాలకు 21న క్యాంపస్ ఇంటర్వ్యూలు

**గాజువాక :** ప్రముఖ ఫార్మా కంపెనీ హెటిరో డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ యూనిట్లలో ఉద్యోగాల భర్తీకి ఈనెల 21న స్థానిక టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు, 2019–2023 మధ్య బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసి 26 ఏళ్ల లోపు వయస్సు గల అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వార్షిక వేతనం రూ.2.70 లక్షల నుంచి రూ.2.80 లక్షల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, గుర్తింపు కార్డు, విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు.

## అందరికీ చేరువలో ఆయుర్వేద సేవలు

**ఏయూ క్యాంపస్:** ప్రజలందరికీ ఉచిత ఆయుర్వేద వైద్య సేవలు అందిస్తున్నట్టు ఏయూ యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ తెలిపారు. యోగా విలేజ్‌లో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. కేజీహెచ్‌లో సుదీర్ఘ కాలం సేవలు అందించి పదవీ విరమణ చేసిన ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కె.ఈశ్వర్‌కుమార్ రోగులను పరీక్షించి అవసరమైన ఔషధాలు సూచించారు. గతేడాది డిసెంబర్ నుంచి ప్రతి గురువారం నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఇప్పటి వరకు 230 మందికిపైగా సేవలు వినియోగించుకున్నారని భానుకుమార్ చెప్పారు. ఇప్పటి వరకు 32 శాతం ఆర్థరైటిస్, 20 శాతం జీర్ణకోశ సంబంధ, 16 శాతం చర్మ సంబంధ, 15 శాతం మానసిక సంబంధ సమస్యలకు చికిత్స అందించామన్నారు.

## బీఐఎస్ అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలతో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలను రెండు సంస్థల ప్రతినిధులు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ వేదుల సాయికృష్ణ సంతకాలు చేశారు. రెండు సంస్థలు సంయుక్తంగా సదస్సులు, వర్క్‌షాప్‌లు, సింపోజియంలను నిర్వహించనున్నాయి. రీసెర్చ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంల నిర్వహణ, భవిష్యత్తులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే దిశగా నిర్ణయం తీసుకున్నారు. స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమాలు, విద్యా సంబంధిత తరగతులను సంయుక్తంగా నిర్వహించనున్నారు.

# ప్రజాహితం.. సీఎం జగన్ అభిమతం



మాట్లాడుతున్న సమన్వయకర్త కె.కె.రాజు

- మళ్లీ ఆయననే సీఎంగా గెలిపించుకుందాం
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- సచివాలయ కన్వీనర్లకు బీమా సౌకర్యం



హాజరైన సచివాలయ కన్వీనర్లు

**సీతంపేట:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లకు పార్టీ తరఫున బీమా సౌకర్యం కల్పిస్తున్నట్టు నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. అక్కయ్యపాలెం షాదీఖానాలో గురువారం సచివాలయ కన్వీనర్లకు బీమా రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి 2024 ఎన్నికల్లో మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి అయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. 2019లో విడుదల చేసిన మ్యానిఫెస్టోలో 98.5 శాతం హామీలు నెరవేర్చారని, రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమాన్ని అధ్యయనం చేసి ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రతిపక్షాలు, పచ్చ పత్రికల విషప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు.

ఉత్తర నియోజకవర్గంలో నాలుగేళ్లలో రూ.185 కోట్ల వ్యయంతో రోడ్లు, డ్రైయిన్లు, సామాజిక భవనాలు, కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాల నిర్మాణం ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, మరో రూ.35 కోట్ల పనులు ప్రతిపాదన దశలో ఉన్నాయన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంలో కేవలం రూ.48 కోట్ల పనులు చేపట్టారని గుర్తుచేశారు. గతంతో పోల్చితే మూడున్నర రెట్లు అభివృద్ధి జరిగిందన్నారు. ఏ గడపకు వెళ్లినా రోడ్డు బాగోలేదు, డ్రెయిన్ బాగోలేదు, మౌలిక సదుపాయాలు లేవన్న ప్రశ్న ఉత్పన్నం కాకుండా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ధైర్యంగా తల ఎత్తుకుని ప్రజల్లోకి వెళ్లేలా అభివృద్ధి జరిగిందన్నారు. అనుక్షణం ప్రజాహితం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెన్నంటే ప్రజలంతా ఉండాలని కోరారు. 'వై నాట్ 175' సీఎం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయిలో కృషి చేయాలని కె.కె.రాజు పిలుపునిచ్చారు. ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ ప్రతి ఇంటా నూరు శాతం నమోదయ్యేలా శ్రమించాలన్నారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చిక్కాల రామారావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు చల్లా రజని, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్, సాడి పద్మారెడ్డి, సారిపిల్లి గోవింద్, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, కె.వి.ఎన్.శశికళ, పార్టీ వార్డు అధ్యక్షులు, నాయకులు జేసీఎస్ మండల కన్వీనర్లు, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, పేడాడ రమణికుమారి తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య



హేమంత్‌కుమార్ (ఫైల్)

**మర్రిపాలెం:** కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. శ్రీకాకుళానికి చెందిన గున్న హేమంత్‌కుమార్(25) కప్పరాడలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. ఇతడు గతంలో హౌసింగ్ లోన్స్ కంపెనీలో పనిచేసేవాడు. ప్రస్తుతం ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉంటున్నాడు. బుధవారం ఉదయం బిర్లా జంక్షన్ వద్ద ఉంటున్న తన స్నేహితుల రూమ్‌కు అతడు వెళ్లాడు. అక్కడ ఎవరూ లేకపోవడంతో ఒక్కడే మద్యం తాగాడు. రాత్రి స్నేహితులు రూమ్‌కు వచ్చి చూడగా.. హేమంత్‌కుమార్ ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే ఆ స్నేహితులు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం అర్ధరాత్రి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సీఐ ఎస్ సాయి నేతృత్వంలో ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు ఏంటన్న కోణంలో దర్యాప్తు సాగుతోంది.

## ధ్యాన మందిరంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్, సిబ్బంది

**తాటిచెట్లపాలెం:** రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో డాక్టర్ మోహన్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో సుమారు 200 మందికి బీపీ, సుగర్ పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సిబ్బంది ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ఆహారంలో ఎక్కువగా చిరుధాన్యాలు, ఆకుకూరలు వంటివి తీసుకుంటే మంచిదని సూచించారు. ఉదయం నుంచి మందిరంలో బాబాకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. మధ్యాహ్న హారతి అనంతరం ప్రత్యేక అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సంధ్యాహారతి అనంతరం మహిళా భక్తుల పల్లకీ సేవ, బాబా భజన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో రిజ్వాన్, సోఫియా, ప్రసాద్‌లతోపాటు ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గైస్ పూర్వ విద్యార్థుల సమావేశం రేపు

**మురళీనగర్:** కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 1971–1975 బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కాలేజీలోని అన్ని బ్రాంచీలకు చెందిన టాపర్లకు ప్రోత్సాహక బహుమతులతోపాటు కాలేజీ ఫైనలియర్ విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. బ్రాంచీల వారీగా బాలికలు, బాలురుల్లో టాపర్‌తో పాటు కాలేజీ టాపర్స్ రూ.10,000 చొప్పున నగదు బహుమతులను పూర్వ విద్యార్థులు అందజేస్తారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

## ఇగ్నో ప్రవేశాల ప్రవేశాల గడువు పెంపు

**ఎంవీపీకాలనీ:** ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో ప్రవేశాలకు ఈనెల 21 వరకు దరఖాస్తుల గడువును పొడిగించినట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. https://ifnouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## ఎఫ్‌సీఐలో కొత్త కోర్సు ప్రారంభం

**ఆరిలోవ:** ఫుడ్ క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో గురువారం కొత్త కోర్సు ప్రారంభమైంది. డైరెక్టర్ జనరల్ రీ సెటిల్‌మెంట్ కోర్సుల్లో భాగంగా ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ కోర్సు ప్రారంభించారు. ఇందులో 41 మంది చేరారు. ఇది మూడు నెలల కాలవ్యవధి గల కోర్సు అని ఎఫ్‌సీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.వి రమణ తెలిపారు.

దీంతో పాటు ప్రస్తుతం అసిస్టెంట్ కేటరింగ్ మేజర్ కోర్సులో 30 మందికి శిక్షణ జరుగుతుందన్నారు.